క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామయ్యను కలిసిన లీగల్ సెల్ నాయకులు

కల్లూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా, జిల్లా కన్వీనర్‌గా నియమితులైన ఎం.ప్రభాకర్, పి.సువర్ణారెడ్డిలు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రామయ్యను, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిని వారి వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు.

శ్రామిక మహిళల సమస్యలపై ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో రెండో రోజు సీఐటీయూ వర్క్‌షాపు జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పని ప్రదేశాల్లో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. స్త్రీ, పురుషులకు సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.రామాంజనేయులు, డి.అంజిబాబు, సాయిబాబా పాల్గొన్నారు.

కురువలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి



కురువ కులస్తుల కుల దైవం కనకరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కురువ కులస్తులు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగి తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలని కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం జెడ్పీలోని కర్నూలు ఎంపీపీ హాలులో ఆ సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి రంగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కురువ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు కత్తి శంకర్, మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు కిష్టన్న, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, నాగన్న, దేవేంద్ర, సుంకన్న, ధనుంజయ, రామకృష్ణ, వెంకటేష్, దివాకర్, తిరుపాల్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడపలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి ఆపై విద్యార్హత కలిగి 18 నుంచి 26 ఏళ్ల వయస్సు కలిగి ఉన్న వారు శిక్షణకు హాజరు కావొచ్చన్నారు. 35 రోజుల శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అడ్మిషన్స్, పూర్తి వివరాలకు 900 04 87423 నంబరును సంప్రదించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన అవార్డు గ్రహీతలతో ఏపీ హెచ్‌ఎంల సంఘం నాయకులు

కర్నూలు సిటీ: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులను ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమానికి ఆ సంఘం పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఎంఈఓ-2 ఆదాం బాషా, హెచ్‌ఎంలు రమ, రామచంద్రారెడ్డి, సలావుద్దీన్, భీమన్న, శివరాం, డీసీ హుసేన్‌ను ఘనంగా సన్మానించారు. ఇందులో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస యాదవ్, వై.నారాయణ, కోశాధికారి హుసేన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీ నందన.. పాప విమోచన

కర్నూలు కల్చరల్: గణేష్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కర్నూలు నగరంలో ఏడోరోజు ఆదివారం వినాయకుని ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొని పార్వతీ తనయుడిని దర్శించుకున్నారు. మండపాల వద్ద లక్ష్మీ, గణపతి హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్ర పారాయణాలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యువకులు, మహిళలు, పిల్లలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అల్పాహార, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద నిర్వహించిన పూజల్లో నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, కార్యాధ్యక్షులు సీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు హరీష్‌బాబు, సహ ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ, జిల్లా కార్యాధ్యక్షులు సందడి సుధాకర్, ఉపాధ్యక్షులు రంగస్వామి, జిల్లా సమన్వయకర్త డాక్టర్ నాగఫణి శాస్త్రి, తదితరులు వివిధ ప్రాంతాల్లోని వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.




ఏ క్యాంపు ఉయ్యాలవాడ సర్కిల్‌లో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కార్పొరేటర్ కైపా పద్మలత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్



వన్‌టౌన్ మంగలిగేరిలో గణనాథుడు



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో..



రాంబొట్ల ఆలయం వద్ద భారీ వినాయకుడు



కొత్తపేటలో ..



బాపూజీనగర్‌లో..



బుధవారపేటలో అన్నదాన కార్యక్రమంలో కర్నూలు మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కోల్స్ చర్చి సంఘం అధ్యక్షుడిగా ఏడీ అబ్రహం లింకన్

కర్నూలు (టౌన్): నగరంలోనే అత్యధికంగా సభ్యత్వం కలిగిన కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి సంఘం నూతన అధ్యక్షుడిగా ఏడీ అబ్రహం లింకన్ విజయం సాధించారు. 2023-2025 సంవత్సరానికి సంబంధించి చర్చి పాలకవర్గం కోసం నిర్వహించిన ఎన్నికల్లో పావురం గుర్తు, స్టార్ గుర్తుతో రెండు ప్యానళ్లకు సంబంధించి కమిటీ సభ్యులు పోటీ పడ్డారు. ఓటింగ్ పూర్తి అయిన తరువాత ఎన్నికైన సభ్యులను ఆదివారం చర్చి పాస్టర్లు పాస్కల్ ప్రకాష్, అనిల్‌కుమార్ ప్రకటించారు. కోల్స్ చర్చి సంఘం కార్యదర్శిగా జాన్ విల్సన్, ప్రాపర్టీ కమిటీ చైర్మన్‌గా రాబర్ట్ క్లెవ్, కోశాధికారిగా లక్ష్మణ్ యూత్ డైరెక్టర్‌గా ఎలిజబెత్ రాణి, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా దేవమనోరాజ్, స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా జయకుమార్ ఎన్నికయ్యారు.అనంతరం చర్చి సంఘం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పదవికి మరింత వన్నె తెస్తానని, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు అత్యధికంగా ప్రాధాన్యత ఇస్తానన్నారు. అనంతరం నూతన కమిటీని పూలమాలలతో చర్చి సభ్యులు ఘనంగా సత్కరించారు.



కోల్స్ చర్చి నూతన పాలకవర్గం

సంక్షిప్త సమాచారం

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: పాత పెన్షన్ విధానం కోసం ఫ్యాప్టో, ఫోర్టో, ఏపీ సీపీఎస్ఈఏ, ఏపీ సీపీఎస్‌యూఎస్‌ల ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మన్ ప్రకాష్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, తిమ్మప్ప ఆదివారం ఒక ప్రకటనలో కోరారు

ప్రభుత్వమే టమాట కొనుగోలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): అన్నదాతలు పండించిన టమాటను ప్రభుత్వమే కిలో రూ.15 ప్రకారం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లాకార్యదర్శి జి.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పత్తికొండ మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడంతో పండించిన పంటను రైతులు రోడ్లపై పారబోయడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. .

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలివ్వాలి

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న చెత్త సేకరణ వాహనాల డ్రైవర్ల(క్లాప్)కు వెంటనే పెండింగ్ జీతాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మలమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో క్లాప్ డ్రైవర్ల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారేళ్ల రామాంజనేయులు, సాయిబాబా, అబ్దుల్‌దేశాయ్, నరసింహులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీపై చర్యలకు డిమాండ్

కర్నూలు(సెంట్రల్) : ముస్లింలపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేష్ బిదూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, షేక్ మహ్మద్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు అవాజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వెంటనే రమేష్ బిదూరి లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు.

కొరటాల జీవితం నేటి తరాలకు ఆదర్శం

కర్నూలు(సెంట్రల్) : భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) నేత, స్వర్గీయ కొరటాల సత్యనారాయణ జీవితం నేటి తరాలకు ఆదర్శమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో కొరటాల శత జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గుంటూరు జిల్లాలో జన్మించిన కొరటాల నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య, బసవ పున్నయ్య వంటి నాయకులతో కలిసి పనిచేశారని, ఆయన ఆదర్శాలు, భావాలు నేటి తరానికి స్ఫూర్తి నిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.రామాంజనేయులు, కేవీనారాయణ, పి.నిర్మల, పీఎస్‌రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(రాజ్‌విహార్): నగర ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. తర్వాత వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సిఫారసు చేశారు.

ఇంటి తోటల్లో రాణిద్దాం

కర్నూలు(సెంట్రల్) : ఇంటి తోటల్లో రాణించేందుకు ఒకరికొకరు సహకరించుకోవాలని టెర్రస్ గార్డెన్ల సమన్వయ కర్త హరికృష్ణ సూచించారు. ఆదివారం సీక్యాంపులోని సబ్ ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో టెర్రస్ తోటల పెంపకం దారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో అనేక మంది మహిళలు టెర్రస్ గార్డెన్లను నిర్వహించడం అభినందనీయమన్నారు. మొక్కలను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. అనంతరం జీవ ఎరువులు, పూల మొక్కలు, వర్మీ కంపోస్టు ఎరువులను వాడే విధానంపై అవగాహన కల్పించారు.

శ్రీశైలదేవస్థానంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్, కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 13 మంది అంతర్గత బదిలీలను చేస్తూ ఈఓ ఎస్ లవన్న ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ప్రధానంగా స్వామివారి ఆలయ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.దివాకర్‌రెడ్డిని జి-2, ఎల్-1 సీట్ కు బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ లోకేశ్వరప్పను స్వామివారి టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ డి.బాలకార్తిక్ గౌడ్ ను డీసీబి విధులకు కేటాయించారు. అలాగే పలువురు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్ ,అటెండర్, ఒప్పంద సిబ్బంది, డైలీ వేజర్స్ సిబ్బంది మొత్తం 13 మంది సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే విధుల్లో చేరాలని ఈఓ పేర్కొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపును సోమవారం చేపట్టనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్ గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. శ్రావణమాసం ఉత్సవాల తర్వాత ఈ నెల 21న గురువారం హుండీ లెక్కింపు జరిగిందని మళ్లీ సోమవారం రెండవ సారి హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

శ్రీమఠంలో న్యాయమూర్తి

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కేరళ హైకోర్టు న్యాయమూర్తి సోమరాజన్ ఆదివారం రాత్రి మంత్రాలయం విచ్చేశారు. మఠం ఏపీఆర్వో బిందు స్వామి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలుకగా ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనంను దర్శించుకుని పూజలు చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు న్యాయమూర్తికి రాయరు జ్ఞాపిక, శేషవస్త్రం అందజేశారు.

స్పోర్ట్స్

తైక్వాండో క్రీడతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినికి బెల్టులు ప్రదానం చేస్తున్న ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): తైక్వాండోని అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి, ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక శరీన్‌నగర్‌లోని విజేత పాఠశాలలో తైక్వాండో బెల్టుగ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన విజేతలకు బెల్టులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు బి. వెంకటేశ్వర్లు, బ్లాక్ బెల్ట్ మాస్టర్లు ఓబులేసు, మాస్టర్ నాగన్న, శ్యాంసన్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి కరాటే సాధన

కర్నూలు (టౌన్) : మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి కరాటే సాధనం ఉపయోగపడుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ వద్ద ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కరాటే బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని వైద్యులు డాక్టర్ చల్లా వాసు రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని భాష్యం స్కూల్‌లో చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విష్ణు కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాసరావు, చెస్ చీఫ్ ఆర్బిటర్ రామసుబ్బారెడ్డి, ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవింద్ జీయర్, స్పార్క్ చెస్ అకాడమీ డైరెక్టర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌గా పెద్దహరివాణం

ఆదోనిసెంట్రల్: మండలంలోని పెద్దహరివాణం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచి సత్తాచాటారు. గత మూడురోజులపాటు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటారు. అండర్-14, అండర్-17 పోటీల్లో బాలుర బాలికల విభాగాల్లో కబడ్డీ పోటీల్లో విజయం సాధించారు. అండర్-17లో మొదటిస్థానంలో నిలవగా, అండర్-14లో మూడో స్థానంలో నిలిచారు. అలాగే అండర్-14, అండర్-17లలో 400 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానంలో నిలిచారు. అండర్-17 విభాగం 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారు. 1500 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచారు. అండర్-14 లాంగ్‌జంప్‌లో మొదటిస్థానంలో నిలిచారు. ఈ విధంగా ప్రతి పోటీల్లో పెద్దహరివాణం పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆరోగ్య సురక్ష... ప్రజారోగ్యానికి భరోసా



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో పీహెచ్‌సీపీ సిబ్బంది



పర్లలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య (ఫైల్)

- వేగంగా జరుగుతున్న ఇంటింటి సర్వే
- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 27వరకు గ్రామాల వారీగా హెల్త్ క్యాంపులు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నాడు- నేడు పథక కింద ప్రభుత్వాసుపత్రుల ఆధునీకరించిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించింది. ఇప్పటికే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం అందరి మన్ననలు పొందుతోంది. నెలలో రెండుసార్లు రోగుల ఇంటి వద్దకే డాక్టర్లు వెళ్లి అందజేస్తున్న వైద్య సేవలపై హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 15న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండల వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటున్నారు. షుగర్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం వివరాలను నమోదు చేస్తున్నారు. మండలంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 24,828 జనాభా, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 21,753 మంది జనాభా ఉంది. ఏఎన్‌ఎంలు, ఎమ్‌ఎల్‌పీహెచ్, ఆశాలు ఇంటింటి సర్వేను వేగవంతం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

54శాతం సర్వే పూర్తి

మండలంలో ఎ.గోకులపాడు, బస్తిపాడు, కొంగనపాడు, నాయకల్లు, పర్ల-1, పెద్దటేకూరు, పుసులూరు, తడకనపల్లె, ఉలిందకొండ-1 సచివాలయాల్లో వేగంగా సర్వే జరుగుతుంది. ఏఎన్ఎంలు, ఎమ్‌ఎల్‌పీహెచ్, ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో సర్వేను కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో 54శాతం సర్వే పూర్తి చేసినట్లు సమాచారం. మిగతా గ్రామాల్లోనూ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించేలా ఆయా పీహెచ్‌సీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

30 నుంచి హెల్త్ క్యాంపులు


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల వారీగా క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ నెల 30న ప్రారంభమై అక్టోబర్ 27 వరకు ఆరోగ్య క్యాంపులు జరుగనున్నాయి. ఈ నెల 30తేదీన ఉలిందకొండ-1, బస్తిపాడు-అక్టోబర్ 3, కొంగనపాడు-4, పుసూలురు-5, పర్ల (1)-6, తడకనపల్లి- 7, నాయకల్లు-10, పెద్దటేకూరు-11, ఎ.గోకులపాడు-12, ఉలిందకొండ (2)-13, బొల్లవరం-16, చిన్నటేకూరు-17, పర్ల(2)-19, సల్కాపురం-21, కె.మార్కాపురం-27 తేదీల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. క్యాంపుల్లో 104లో ఉండే డాక్టరు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్, ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారు. హెల్త్ క్యాంపుల నిర్వహణలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి కార్యక్రమంలో పాల్గొంటారు.

ఆరోగ్య క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఇందుకు సంబంధించిన ఇంటింటి సర్వేను ఆయా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, ఇతర అధికారుల పర్యవేక్షణలో వేగంగా జరుగుతుంది. 30వ తేదీ నుంచి గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఉంటాయి. ప్రతి క్యాంపులో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, 104 డాక్టరు, పీహెచ్‌సీ డాక్టరు సేవలందిస్తారు. ప్రజలు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి. – జీవీ రమణమూర్తి, ఎంపీడీఓ, కల్లూరు

నిమజ్జన ఏర్పాట్లు



కేసీలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



ముస్తాబవుతున్న వినాయకఘాట్



నీటి నిల్వ కోసం అడ్డుగోడగా ఇసుక సంచులు

ఈ నెల 26న జరిగే వినాయక నిమజ్జనానికి అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక ఘాట్ నుంచి జోహరాపురం వరకు కేసీ కెనాల్‌ను శుభ్రం చేస్తున్నారు. జేసీబీల సాయంతో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. నిమజ్జనానికి అవసరమైన నీటి నిల్వ కోసం జోహరాపురం బ్రిడ్జి వద్ద ఇసుక సంచులను అడ్డుగా వేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

సమాజ జాగృతికి రచనలు దోహద పడాలి

కర్నూలు కల్చరల్: సమాజ జాగృతికి రచనలు దోహద పడాలని సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. ప్రముఖ రచయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మ రచించిన ఆరు రచనలను ఆదివారం స్థానిక మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, తెలుగు భాష వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ, వినియోగదారుల ఫోరం కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్, శ్రీ శ్రీ కళావేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షు ఎస్. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రచయిత్రి భారతం 3,4,5 సంపుటాలతో పాటు సాయి చరిత్ర, గోమాత, రమణీయ కల్యాణాలు రచించారన్నారు. డాక్టర్ చంద్రమౌళిని, సీతామహాలక్ష్మి పుస్తక సమీక్ష చేశారు. నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు హరికిషన్, ఎలమర్తి రమణయ్య, దండబోయిన పార్వతీ దేవి, వియోగి, వెంకటేశ్వర్లు, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, భవాని, లీలావతి, అజీజ్, సువర్ణజోషి, సూర్యశ్రీ, సునీత, తదితరులు పాల్గొన్నారు.



రచయిత్రి వరలక్ష్మమ్మను సన్మానిస్తున్న దృశ్యం